పోలింగ్ ప్రశాంతం

• బారులు తీరిన ఓటర్లు • వృద్ధులు సైతం ఓటు హక్కు వినియోగం • పలు చోట్ల ఈవీఎంలు, వీవీప్యాట్‌ల మొరాయింపు



జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. ఎండల తీవ్రత వల్ల ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఓటు సంకల్పంతో కొంత మంది వృద్ధులు స్టాండు, కర్రసాయంతో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు హక్కు వినియోగించుకొని ఆదర్శంగా నిలిచారు. యువ ఓటర్లు సైతం తమ ఓటును వినియోగించుకొని స్ఫూర్తిని చాటారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓటేసిన వృద్ధులు



శివ్వారంలో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న పోలీసులు



దండేపల్లిలో...



దండేపల్లిలో వీల్‌చైర్ సాయంతో...



నెన్నెలలో...



దుగ్నేపల్లిలో వృద్ధురాలిని తీసుకొస్తూ...



హాజీపూర్ మండలం ముల్కల్లలో...



లక్సెట్టిపేట ప్రభుత్వ కళాశాల బూత్ వద్ద



బెల్లంపల్లిలో...



భీమారంలో...



జెండావెంకటాపూర్‌లో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దంపతులు

నెన్నెలలో 74.28 శాతం

నెన్నెల: మండలంలో 19025ఓట్లకు గాను 14,131ఓట్లు పోలయ్యాయి. మొత్తం 74.28 శాతం పోలింగ్ నమోదైంది. జెండావెంకటాపూర్‌లో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తహసీల్దార్ రమేష్, ఎస్సై ప్రసాద్, ఎంపీడీఓ దేవేందర్ రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్‌లు పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులను సమీక్షించారు.

చెన్నూర్ మండలంలో...



కాచన్‌పల్లిలో బారులు తీరిన మహిళా ఓటర్లు

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లిలోని మోడల్ పోలింగ్ కేంద్రంలో 73.29శాతం పోలింగ్ జరిగింది. గ్రామంలో మొత్తం 996మంది ఓటర్లు ఉండగా, 730మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



దండేపల్లిలో బారులు తీరిన ఓటర్లు

దండేపల్లిలో 69.45శాతం..

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లిలో పోలింగ్ కేంద్రం 35లో లూజ్ కనెక్షన్‌తో ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ మొదలయ్యింది. కుందేల్‌పహాడ్‌లోని పోలింగ్ కేంద్రం 41లో మాక్‌పోలింగ్ సమయంలో వీవీప్యాట్ మొరాయించడంతో పోలింగ్ గంటన్నర ఆలస్యంగా ప్రారంభం అయ్యింది. ఓటేసేందుకు వచ్చిన ఓటర్లు ఎదురు చూశారు. నెల్కివెంకటాపూర్‌లోని 43 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో అరగంట నిలిచింది. మరో ఈవీఎం ఏర్పాటు చేసి పోలింగ్ కొనసాగించారు. దండేపల్లి 46 పోలింగ్ కేంద్రంలో ఏజెంట్ పాస్ కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య స్వల్పవివాదం నెలకొంది. అధికారులు ఇరుపార్టీల వారిని సముదాయించడంతో వివాదం సద్దుమనిగింది. సాయంత్రం 5గంటల వరకు 69.45 పోలింగ్ శాతం నమోదైనట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు.



పోలింగ్ ఆలస్యంతో ఓటర్ల ఎదురు చూపులు

తాండూర్‌లో 69.08 శాతం...

తాండూర్: మండల వ్యాప్తంగా 37 పోలింగ్ కేంద్రాల్లో 27209 మంది ఓటర్లకు గాను 18797మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 69.08శాతం పోలింగ్ శాతం నమోదైంది. అధికారులు పలుచోట్ల పోలింగ్ సరళిని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తాండూర్, అచలాపూర్ ఎన్నికల కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. తాండూర్ పోలింగ్ కేంద్రాలతో పాటు పలుచోట్ల బ్యాటరీ సమస్యలతో ఈవీఎంలు స్వల్పంగా మొరాయించినప్పటికీ ఓటింగ్ ప్రక్రియలో పెద్దగా ఆలస్యం జరగలేదు.



నర్సాపూర్‌లో ఓటు వేసేందుకు బారులు



రేండ్లగూడలో ఓటేసిన చర్లపల్లి జైలర్ దంపతులు

భీమారంలో 69.57శాతం...

భీమారం: మండలంలో 69.57శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 12468 ఓటర్లు ఉండగా, 8947మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సంఘం అందజేసిన పోలింగ్ స్లిప్‌లను సిబ్బంది సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయగా స్లిప్‌ల కోసం వెతికారు. కాగా పోల్ స్లిప్‌లు లభించని వారు ఓట్లు వేయకుండనే ఇంటికి వెళ్లిపోయారు. వారం రోజుల ముందే ఓటరు స్లిప్‌లు అందజేశామని అధికారులు ప్రకటించినా, చాలా మందికి స్లిప్‌లు అందలేదని ఓటర్లు పేర్కొన్నారు.



భీమారంలో ఓటు వేసేందుకు బారులు

హాజీపూర్‌లో...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎన్నికల అధికారులు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ జరిపి శ్రీకారం చుట్టారు. మండలంలోని సబ్బెపల్లి, కర్ణమామిడి, నంనూర్ గ్రామాల్లో దాదాపు అరగంట పాటు ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లు మొరాయించాయి. అధికారులు వెంటనే స్పందించి ఓ చోట అదనపు ఈవీఎం బ్యాలెట్ సమకూర్చగా మరో రెండు చోట్ల వాటిని సరిచేయడంతో పోలింగ్ యదావిధిగా కొనసాగింది.



సబ్బెపల్లిలో బారులు తీరిన ఓటర్లు

జన్నారంలో...

జన్నారం: మండలంలో 11గంటల వరకు ఓటేసేందుకు ఎక్కువ సంఖ్యలో ఓటర్లు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. 11 తర్వాత పోలింగ్ నెమ్మదిగా కొనసాగింది. 11గంటల వరకు కేవలం 30శాతం పోలింగ్ నమోదైంది. సాయంకాలం వరకు పోలింగ్ కొనసాగింది. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి సరళిని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. చర్లపల్లి జైలర్ సత్యం దంపతులు హైదరాబాద్ నుంచి రేండ్లగూడకు స్వగ్రామానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

లక్సెట్టిపేట...

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట గ్రామంలోని మోడల్ పోలింగ్ బూత్‌లో ఓటర్లు ఓట్లను వినియోగించుకున్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఓటర్లు వినియోగించుకున్నారు. అంకతిపల్లిలో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ బూత్‌లో ఓటర్లు ఓట్లను వినియోగించుకున్నారు. కొంతమంది ఓటర్లకు సమయం తెలియక ఆరు గంటల వరకు అనుకుని ఆలస్యంగా వచ్చి వెనుదిరిగిపోయారు. మండల వ్యాప్తంగా 67శాతం పోలింగ్ అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



73వ పోలింగ్ బూత్ వద్ద...

మందమర్రిలో...

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి హైస్కూల్‌లోని 48 వ పోలింగ్ కేంద్రంలోని ఈవీఎం మొరాయించగా దాని స్థానంలో కొత్త ఈవీఎంలను ఏర్పాటు చేశారు. మండలంలోని ఆదిల్‌పేట్‌లోని ప్రభుత్వం పాఠశాలలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, పట్టణంలోని కార్మెల్ హైస్కూల్‌లో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, పాత బస్టాండ్ సమీపంలోని మేదరివాడలో గల ప్రభుత్వ పాఠశాలలో జీఎం మనోహర్-సవిత దంపతులు వారి ఓటును వినియోగించుకున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బైక్‌పై తిరిగి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.



ఓటేసినట్లు చూపుతున్న జీఎం మనోహర్ దంపతులు

వేమనపల్లిలో 74.75 శాతం

వేమనపల్లి: మండలంలో 14,984ఓట్లకు గాను 11,201ఓట్లతో 74.75 శాతం పోలయ్యాయి. వేమనపల్లిలోని 188 పోలింగ్ బూత్‌లో 4 గంటల సమయం తర్వాత కూడా లోపల ఉన్న ఓటర్లకు గంటన్నర సేపు సమయం ఇచ్చి ఓటు వేయించినట్లు ఏఈఆర్‌ఓ, తహసీల్దార్ రమేష్ తెలిపారు. 4 రూట్లలో సెక్టోరల్ అధికారులు బాపురావు, శ్రీధర్‌రెడ్డి, నరేష్, వెంకటేశ్వర్లు ఓటింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఓటింగ్ సరళిని పెంచేందుకు పలుచోట్ల జీపీ అధికారులు తీవ్రమైన కసరత్తులు చేశారు. రాకపోకలకు ఇబ్బంది కాకుండా ఆటో, వీల్‌చైర్ సౌకర్యాలు కల్పించారు. తాగునీరు, అంబలి, నిమ్మరసం అందజేశారు.

నస్పూర్‌లో 49.62శాతం...

నస్పూర్: పట్టణ పరిధిలో 49.62శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. విలేజ్ నస్పూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బదావత్ సంతోష్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 219, 220 పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. టెక్నికల్ సిబ్బంది వాటిని సరిచేసారు. సీతారాంపల్లి పోలింగ్ బూత్ వద్ద దాదాపు సాయంత్రం 5.30 వరకు పోలింగ్ కొనసాగింది. నిర్ణీత సమయంలో క్యూలైన్‌లలో ఉన్న వారికి ఓటు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. పలు బూత్‌లలోని పోలింగ్ సిబ్బందికి ఆదివారం రాత్రి ఆలస్యంగా భోజనం అందించారని సిబ్బంది కొంత అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం నాలుగు గంటల వరకే పోలింగ్ సమయం కాగా పలువురు ఓటర్లు సమయం మించిపోయిన తరువాత పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చారు. వారిని పోలిసులు పోలింగ్ కేంద్రాల లోనికి అనుమతించలేదు. దీంతో ఓటర్లు నిరాశగా వెనుదిరిగారు.



పోలింగ్ కేంద్రానికి ఆలస్యంగా చేరుకున్న ఓటర్లు



మంచిర్యాలలో ఓటేసిన దుర్గం అశోక్ దంపతులు



హమాలివాడలో ఓటేసినట్లు చూపుతున్న ఓ కుటుంబం

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యేలు



ఆర్‌కేపీలో పార్టీ కేడర్‌తో ఎమ్మెల్యే వివేక్



మామిడిపల్లిలో ఓటర్లతో మాట్లాడుతున్న పీఎస్సార్

చెన్నూర్/రామకృష్ణాపూర్: పెద్దపల్లి పార్లమెంట్‌లో గెలుపు వంశీకృష్ణదేనని, ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేస్తున్నారని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్‌లో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ సరళిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌కేపీలో పోలింగ్ కేంద్రాలను కూడా పరిశీలించారు.

దండేపల్లి: ఎన్నికల తీరును పరిశీలించేందుకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు సోమవారం దండేపల్లి మండలంలోని పాతమామిడిపల్లి, లింగాపూర్, నెల్కివెంకటాపూర్ గ్రామాల్లో పర్యటించారు. అక్కడి నాయకులు, ఓటర్లతో మాట్లాడి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.



క్యూలో ఉన్న ఓటర్లకు అభివాదం చేస్తున్న వినోద్

బెల్లంపల్లి: నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్‌లను ఎమ్మెల్యే వినోద్ పరిశీలించారు. ఓటర్లతో ముచ్చటించి పోలింగ్ వివరాలు తెలుసుకున్నారు.

కాసిపేటలో...

కాసిపేట: మండలంలోని సోమగూడెం(కె) లంబాడితండా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ రాహుల్ పరిశీలించి ఏర్పాట్లను రివ్యూ చేశారు. దేవాపూర్, లంబాడితండా పోలింగ్ కేంద్రాలను మహిళ పోలింగ్ కేంద్రం, మోడల్ పోలింగ్ కేంద్రంగా ప్రకటించి ఏర్పాట్లు చేయడంతో అందరినీ ఆకట్టుకున్నాయి. ఓటర్లకు పువ్వులు ఇస్తూ ఓటు వేసేందుకు స్వాగతించారు. కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు ఏర్పాట్లు చేశారు. ఓటు విలువ తెలియజేస్తూ ప్రవేశ ద్వారం నుంచి లోని వరకు ఎన్నికల సంఘం కమిషనర్ల ఫొటోలతో ముద్రించిన పోస్టర్ల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

భీమిని, కన్నెపల్లి మండలాల్లో...

భీమిని: భీమిని మండలంలో 8522ఓటర్లకు గాను 6,775మంది ఓటుహకక్కు వినియోగించుకున్నారు. 79.50 శాతం పోలింగ్ నమోదు అయింది. కన్నెపల్లి మండలంలో 13,862ఓటర్లకు గాను 11,095ఓట్లు పోలయ్యాయి. 80.04 శాతం పోలింగ్ నమోదైంది. భీమిని మండలం నుంచి కేస్లాపూర్, చిన్నతిమ్మాపూర్, చిన్నగుడిపేట, కన్నెపల్లి మండలంలోని సాలిగాం, మాడవెల్లి గ్రామపంచాయతీలు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉండటంతో ఈ ఐదు గ్రామపంచాయతీల ఈవీఎంలను కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు తరలించారు. మిగితా గ్రామపంచాయతీల్లోని ఈవీఎంలను మంచిర్యాల జిల్లాకు స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు.



నడుచుకుంటూ ఓటు వేసేందుకు వెళ్తూ...

కాలినడకన వచ్చి ఓటేసిన తంగళ్లపల్లి ఓటర్లు..

భీమిని మండలంలోని చిన్నతిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తంగళ్లపల్లిలో సుమారు 300మంది ఓటర్లు ఉన్నప్పటికీ పోలింగ్ బూత్ లేకపోవడంతో సుమారు 3 కిలోమీటర్ల దూరం కాలినడకన వాగు దాటి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బెల్లంపల్లి మండలంలో...



బెల్లంపల్లిరూరల్: మండలంలోని తాళ్లగురిజాలలో మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓటింగ్ సెల్ఫీ పాయింట్ ఓటర్లను ఆకట్టుకుంది.

జైపూర్‌లో...

జైపూర్: ఓటర్లు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం మధ్యాహ్నం 1గంట తర్వాత పెద్దగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు కనిపించలేదు. కొన్ని కేంద్రాల్లో 4 తర్వాత కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించకపోవడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. జైపూర్ పోలింగ్ కేంద్రాన్ని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

కోటపల్లిలో...

కోటపల్లి: మండలంలోని 31 పంచాయతీల్లోని 33 పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని రాజారం గ్రామంలోని ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజారం, ఆలుగామ, రాంపూర్, సిర్సా గ్రామంలో సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మందకొడిగా పోలింగ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం తగ్గింది. మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు కొంత విఫలమయ్యారు. వేసవి కాలం కావడంతో పోలింగ్ చీటీలు పంపిణీ చేసే బీఎల్‌వోలు, ఓటర్లకు నీడ కోసం టెంటు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే కూర్చోవాల్సి వచ్చింది. తాగునీరు సరఫరా సక్రమంగా చేయకపోవడంతో సిబ్బంది, ఓటర్లకు ఇబ్బందులు తప్పలేదు. హమాలివాడలోని 211వ పోలింగ్ కేంద్రంలో ఆధార్‌లోని పేరు, ఓటరు స్లిప్‌లోని పేరుకు కొద్దిగా తేడా ఉందంటూ పోలింగ్ ఏజెంట్లు అభ్యంతరంతో కొందరిని వెనక్కి పంపించారు.

ఓటు రిగ్గింగ్ అయ్యిందని ఆరోపణ

చెన్నూర్: చెన్నూర్‌లోని ప్రాథమిక పాఠశాల 191వ పోలింగ్ కేంద్రంలో జగేటి శ్రావణ్ ఓటు వేసేందుకు వెళ్లాడు. అప్పటికే శ్రావణ్ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు రికార్డులో ఉంది. దీంతో శ్రావణ్ ఆందోళనకు దిగాడు. తాను వేయకుండా ఎవరో వేశారని అధికారులను ప్రశ్నించాడు. అధికార పార్టీ నాయకులు నా ఓటు రిగ్గింగ్ చేశారని ఆరోపించాడు. 190వ పోలింగ్ కేంద్రంలో బేతాళవాడకు చెందిన శతాధిక వృద్ధుడు రేవెల్లి పోచం(105) ఓటు హక్కు వినియోగించుకున్నాడు. మళ్లీ వచ్చే ఎన్నికల్లో నేను ఓటు వేస్తానో లేదో, ఈసారి ఓటు వినియోగించుకోవడం సంతోషంగా ఉందని తెలిపాడు.

బెల్లంపల్లి నియోజకవర్గంలో 70.96శాతం పోలింగ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 70.96శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎండ తీవ్రతకు తోడు ఉక్కపోత ఉండడంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న చెట్ల నీడపట్టున, భవనం కింద వరుసలో ఉండి ఓటు వేశారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో ఎన్నికల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల అధికారులు ఈవీఎంలను బెల్లంపల్లిలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి తరలించారు.



బెల్లంపల్లి బజార్‌ఏరియా జెడ్పీహైస్కూల్లో...